
# గెలుపు

-సలీం



కల నిజమైనట్లు – స్వాప్నిక జగత్తులో కదలాడిన ఏ సుందర దృశ్యమో ఎదురై ఒయ్యారంగా ఒదిగినట్లు – విజిటర్స్ రూంలో నిలబడి వుంది శిరీష. ఆఫీస్‌కి వచ్చీరావటంతోటే "మీ కోసం ఎవరో వచ్చారు సార్ " అని అటెండర్ చెప్పినపుడు – ఎవరై వుంటారా అని ఆలోచించిన ఆ క్షణంలో శిరీష తప్పమిగతా అందరూ మెదిలి వుంటారు. అందుకే ఆశ్చర్యం – ఆనందం కలగలిపిన భావం చివరికి అవ్యక్తమై తడబడ్డాను.

"అలా అపరిచితుల్ని చూసినట్లు చూస్తావేం - నేనే - భ్రమ కాదు. కావాలంటే చూడు - నిన్ను గిల్లు తాను" తన అద్భుతమైన చిర్నవ్వునే ఆ గదంతా పరిచి - అల్లరిగా - చిలిపిగా ముందుకొస్తున్న శిరీష..

అప్రయత్నంగా ఒకడుగు వెనక్కు వేశాను. విజిటర్స్ రూంలోని అందరూ మా వైపు కుతూహలంగా చూస్తున్నారు.

పెళ్ళయినా - శిరీషలో అప్పటి చలాకీతనం - అల్లరీ - మనసులోని పసితనం - కళ్ళలో అమాయకత్వం తగ్గనేలేదు.

"నిలబడే వున్నావేం" అన్నాను నన్ను నేను సంబాళించుకుంటూ.


"నిన్నెంత తొందరగా చూస్తానో నన్న ఆతురత - ఉత్కంఠ - అసహనం. - కొన్ని క్షణాల్ని కూడా వృధా చేయ కూడదన్న అత్యాశ. అందుకే కూచోలేకపోయాను."

శిరీష ఎవుడూ ఇంతే. పక్కన వేరే వాళ్ళున్నారన్న ద్యాసకూడా వుండదు. వాళ్ళేమైనా అనుకుంటారన్న బిడియమూ లేదు.

నేనెవుడైనా గుర్తు చేసినా - " అంత పిరికితనం ఏమిటే నీలో ఏం అనుకుంటారు? ఓ వేళ అనుకున్నా - అనుకోనీ - మనకేం" అంటుంది, తలను వెనక్కి **రెక్‌లెస్‌గా** ఎగరేస్తూ.

అందుకే బిడియంగా ఓసారి విజిటర్ రూంలోని వ్యక్తుల్ని చూసి - "ఓక్షణంలో వస్తాను - కూచో" అని మా ఆఫీసర్ రూం వైపునకు వడివడిగా నడిచాను.

లీవ్‌లెటర్ వ్రాసిచ్చి - శిరీషను తీసుకుని సూట్‌కేస్‌తో సహా ఆటోలో కూలబడ్డాను.




శిరీష మాట్లాడుతూనే వుంది - **మాట్లాడటం** ఆమె జన్మహక్కైనట్లు. ఆ కళ్ళు ఆనందంతో - అంతులేని కాంతితో మెరుస్తూనే వున్నాయి. ఆ పెదవులు నాట్యం చేస్తున్నట్లు మృదువుగా, అందంగా కదుల్తూనే వున్నాయి. ఆ కొద్దిసేపట్లోనే కొన్ని వందల జ్ఞాపకాలు మనో యవనిక తొలగించి మంద్రంగా హృదయ సైకతాల మీద ఈ చివర్నించి ఆ చివరకి వీచాయి.

యిల్లొచ్చింది. జ్ఞాపకాల దొంతర లోంచి జారిపడ్డాను.

"యిదే బెడ్‌రూం కం డైనింగ్ రూం కం డ్రాయింగ్ రూం - అదుగో అదే కిచెన్ - ఇది బాత్రూం" అని వివరించాక ఓ కుర్చీలాగి శిరీషను కూచోమని చెప్పాను.

"నాకు అతిథి మర్యాదలు చేస్తున్నావా - ఈగదేమిటి ఇంత అస్తవ్యస్తంగా వుంది?" లేచి చీరకొంగు నడుములో దోపుకుని పనికి ఉపక్రమించింది. డైనింగ్ టేబిల్ మీదున్న వస్తువులన్ని సర్దింది. మంచం మీద దుప్పట్లు, బట్టలు, పుస్తకాలు - అన్నీ సర్దింది నీట్‌గా.

స్టౌమీద స్నానానికని నీళ్ళు పడేశాను.

"రోజూ వంటచేసుకుంటున్నావా?" కిచెన్ గడపకు ఆనుకుని నుతారంగా నిలబడి నవ్వుతోంది.

"మధ్యాహ్నం హోటల్లోనే భోంచేస్తాను. రాత్రుళ్ళు వండుకుంటాను"

శిరీష కళ్ళలో బాధ-

"ఎందుకీ కష్టం చెప్పు హాయిగా పెళ్ళి చేసుకోవచ్చుగా"

నేను సమాధానం చెప్పలేదు. ఇద్దరికీ సమాధానం ఏమిటో తెలుసు. టాపిక్ మార్చటం మంచిదనిపించింది.

"ఈ మధ్యకాలంలో నా లైబ్రరీలోకి బోల్డు కొత్త పుస్తకాలు వచ్చి చేరాయి. చూస్తావా" అన్నాను ఉత్సాహంగా.

నాకళ్ళల్లోకి దీర్ఘంగా ఓసారి చూసి - గాఢంగా నిట్టూర్పు విడిచి నాతో పాటు కదిలింది.

నేను కొన్న కొత్త పుస్తకాలన్నీ చూపిస్తున్నాను. తను పరధ్యానంగా చూస్తోంది. చూపంతా నా వైపే. ట్రిగ్గర్ మీద వేలుంచి ఎక్కుపెట్టిన తుపాకీలా - ఆమె చూపు గుచ్చుకోవటం - ఆమె కళ్ళలోని బాధ - అందులోని ప్రేమా - వాత్సల్యం ......

"ఇలా ఎంతకాలం? నీవు పుస్తకాల పురుగువని తెల్సు. కానీ ....జీవితం బోర్ కొట్టదూ - నన్ను శిక్షించటానికేనా ఇదంతా - అయినా నేనేం తప్పచేశానని ఈ క్షోభ నాకు- " ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

నాకూ బాధ వేసింది. శిరీష అందమైన కళ్ళలో కన్నీళ్ళు చూడలేను. అది నా బలహీనత.

అనునయంగా శిరీష చేతిని నా చేతుల్లోకి తీసుకుని ఆ నాజూకైన వేళ్ళను ఓ క్షణం లాలిస్తున్నట్టు స్పృశించి వదిలేశాను.

"పోనిద్దూ - నీకెపుడూ నా గొడవే. నాకేం - హాయిగా వున్నాను. చూశావా - రెండేళ్ళ ఉద్యోగ పర్వంలో ఎన్ని వస్తువులు కొన్నానో. డైనింగ్ టేబిల్, గ్యాస్ స్టవ్, ఫ్రిజ్, టీవీ...ఉద్యోగానికి ముందు నేననుభవించిన పేదరికం మీది కసితో...."

"అసలేమైనా తింటున్నావా లేక సంపాదనంతా నీ కసి తీర్చుకోడానికి వాడేస్తున్నావా?" ఓసారి తలయెత్తి నా ముఖంలోకి చూసి సరదా మూడ్‌లోకి వచ్చేస్తూ అంది.

శిరీష ఎపుడూ ఇంతే. ఓ క్షణం జలజలా పారే సెలయేరులా తుళ్ళుతుంది. మరుక్షణం మృత సైకతంలా నిశ్శబ్దంలో ఒదిగి పోతుంది. ఇంకో క్షణం హోరెత్తే జలధిలా విరుచుకు పడుతుంది. ఆ వెంటనే వర్షించబోయే మేఘంలా కదిలి కన్నీళ్ళతో ముంచెత్తుతుంది.

సమాధానం కోసం కళ్ళను ప్రశ్నార్థకాల్లా పెట్టిన శిరీషకు సమాధానం ఎలా చెప్పాలా అని ఓక్షణం తటపటాయించి చెప్పాను.


"ఏకాకిని, నాకెవరున్నారని - నా తిండి ఖర్చుపోను మిగిలిందంతా ఏం చేయాలి - ఎవరిక్కావాలి. అందుకే ......."మధ్య లోనే ఆగిపోయాను. శిరీష కళ్ళలో విజృంభించిన బాధ తాలూకు నీలినీడలు.

నన్నటి వెక్కిళ్ళతో ఏడుస్తోంది.

ఓక్షణం ఏం చేయాలో తెలియలేదు. ఆమెను ఒడి చేర్చి లాలించాలన్న కోరిక - ఆమె ఒడిలో వాలిపోయి సేదతీరాలన్న బలమైన కోరిక. అప్రయత్నంగానే శిరీషకు దగ్గరగా జరిగాను.

ఉప్పెనలా - వెల్లువలా - ఆ క్షణం కోసమే ఎదురు చూస్తున్నట్లు - వరద గోదారిలా నన్నల్లుకుని పోయింది.

"చూశావా - మనవి ఎలా అభిశప్త జీవితాలైపోయాయో - నీవు ఒంటరివాడివి ఎలా అవుతావు - నీకు జీవితాంతం తోడుండాలనే కదా ఆరా



టపడ్డాను. కానీ – నీ ఆత్మ న్యూనతా భావం నీ లోని పిరికి తనం నీ జీవితాన్నే కాకుండా, నీతో ముడి పెట్టుకున్న నా జీవితాన్ని కూడా ఎలా నాశనం చేశాయో. అయినా ఇప్పటికీ మించిపోయింది ఏముంది? నాకు పెళ్ళైనా – నేను ఎప్పటి కీ నీదాన్నే – బలవంతపు పెళ్ళి వల్ల వచ్చిన అనర్థం చూశావా – శరీరం అతనిది – మనసునీది. ఈ విభజన నీ వల్లనే కదూ – నాకీ గుండె కోత నిన్ను ప్రేమించినందుకే కదూ"

శిరీషను కంట్రోల్ చేయడం కష్టమైపోయింది. అలా పది నిముషాలు ఏడుస్తూనే వుంది. వెక్కిళ్ళకు అదురుతున్న ఆమె చేతుల మధ్య నేను – క్షణం క్రితం నాది కాబోయిన ప్రపంచాన్ని నా అవివేకంతో పోగొట్టుకున్న వ్యక్తిలా దుఃఖపడుతూ –

స్టౌమీది నీళ్ళు మరిగి – తెర్లుతున్న శబ్దానికి స్పృహలో కొచ్చాను. ఆమె చేతుల్ని విడిపించుకుని కిచెన్ లోకి వెళ్లాను.

బాత్రూంలో నీళ్ళు పెట్టేసి – టవల్ అందుబాటులో వుంచి గది లోకి వచ్చాను.

శిరీష తల వొంచుకుని ఆలానే కూచునివుంది. మునిశాపం చేత ముకుళించుకుపోయిన దేవకన్యలా –

"స్నానానికి నీళ్ళు పెట్టాను" తల వొంచుకుని అపరాధిలా నేను.

శిరీష నిశ్శబ్దంగా స్నానాల గదిలో కెళ్ళింది. ఓ నిమిషంలోనే ముఖం నిండా నవ్వు పండించుకుని బైటికొచ్చింది.

"ఇదేమిటి – బాత్రూంకి తలుపులేదుగా – మరెలా స్నానం చేయడం" ఆమె కళ్ళలో ఒకనాటి అల్లరి – తనూ, నేనూ కాలేజీలో చదువుకునే రోజుల నాటి అల్లరి.

"ఏం పర్లేదు – ఎవరూ రారు" అన్నాను. శిరీషను ఎల్లప్పుడూ ఇలానే అల్లరిగా చూడాలని కోరిక.

"ఎవరో వస్తారని కాదు – నీవే వచ్చేస్తావేమోనని"

"సిల్లీ గర్ల్" అన్నాను. చదువుకునే రోజుల్లో అల్లరి చేసినపుడల్లా ఇలానే అనేవాడిని.

"ఇంకా గర్ల్ ఏమిటి మ్యాన్ – ఐయాం ఎ ఫుల్ గ్రోన్ వుమన్". అయినా నీవు పిరికి కదా – ఆడపిల్ల స్నానం చేస్తుంటే వచ్చి చూసేంత ధైర్యం కూడానా – కనీసం కళాతృష్ణతో నైనా చూడవాయె – హు" అని బాత్రూం లోకి పారిపోయింది.

నేను గదిలో ఒంటరిగా – నా జ్ఞాపకాలకు బలైపోతూ మిగిలిపోయాను. ఒక్కో జ్ఞాపకం ఛురకత్తిలా గుండెల్లో – మెదడు కుదుళ్ళలో – దిగబడిపోతూ....

ఇవే జ్ఞాపకాలు – శిరీషకూ నాకూ పెళ్ళి అయి వుంటే మధురంగా మిగిలిపోయేవి. ఎంత సన్నటి పొర అదృష్టానికీ దుర్ధృష్టానికీ మధ్య – మధురమైన జ్ఞాపకాలకూ, మనసును కోసే జ్ఞాపకాలకూ మధ్య –

నేనూ శిరీష చిన్నప్పటినుండీ ఒకే స్కూల్లో కలిసి చదువుకున్నాం. కటిక పేదరికంలో మ్రగ్గినా ఆరోజులే తీయగా వుండేవి. దానికి కారణం శిరీష స్నేహం. ఎంతటి బాధనైనా, కష్టాన్నైనా మరిపించి, మురిపించగల గొప్ప స్నేహం.

ఒంగోల్లోని ఆ పేటలో శిరీష వాళ్ళదే అతి పెద్ద భవంతి. ఆ పేటలోని మిగతా ఇళ్ళన్నీ సూర్యుడి ముందు దివిటీల్లా వుండేవి. శిరీష వాళ్ళ నాన్న గారు వందెకరాల మాగాణికి అధిపతి. ఓ సినిమా థియేటర్‌కు యజమాని. వాళ్ళింటికి కొద్ది దూరంలో ఓ పూరి గుడిశేలో నేనూ, అమ్మా వుండే వాళ్ళం. మా కోసం నాన్న వదిలేసి వెళ్ళిన ఆస్థి ఆ పూరిల్లే.

అమ్మ కూలి పని చేసేది. పదో తరగతి వరకూ చదవు బాగానే సాగింది, పదో తరగతిలో నాకు మంచి మార్కులొచ్చాయి. ఇంటర్‌లో చేరడానికి డబ్బు లేకపోతే శిరీష ఫీజు కట్టింది. పుస్తకాలు కొనుక్కోడానికీ, బట్టలకూ డబ్బులిచ్చింది. ఇంటల్ మొదటి సంవత్సరంలో వుండగానే రోగంతో – దరిద్రంతో పోరాడిన అమ్మ చనిపోయింది.

ఆలా ఒంటరినైన నన్ను అమ్మలా ఆదుకుంది శిరీష. అప్పటి వరకూ మా మధ్య వున్న స్నేహం బలపడింది. బలీయమైన అనుబంధం ఏర్పడింది.


వాళ్ళ ఇంద్ర భవనం లాంటి ఇంట్లో – ఓ గదిలో నేనూ శిరీష కలిసి చదువుకునే వాళ్ళం. ఆగదిలోకి అన్నం కలుపుకుని వచ్చేది శిరీష. పేదరికపు కరకు పాదాల కింద నలిగిపోతూ అవమానంతో, బాధతో విలవిల్లాడిపోతున్నప్పుడు తన ఒడిలో ఉపశమింపచేసేది. అన్నం గోరుముద్దలు చేసి తినిపించేది.

శిరీష ఎన్ని సార్లు తన ప్రేమను వెల్లడించినా – నేను నా చుట్టూ

## ఉదయం అయిదు గంటలు

కళ్ళు నొప్పెడుతాయి
గుడ్డిగా లైటు
కాంక్రీట్ వెలుతురులో అక్షరాలను తడుముకుంటున్నప్పుడు –
శీతల వేకువ ఝాము, చిరు
చీకటి పెదాలతో ముఖాన్ని ముద్దిడుతుంది గవాక్షపు పరదా తొలగించినప్పుడు
తెల్లవారుఝాము ఐదు గంటల అద్భుత దృశ్యం
ఆదరంగా కౌగిలించుకుంటుంది
కళ్ళను ప్రకృతిపై అద్దినప్పుడు
రెటీనా తపనగా వెతుక్కుంటుంది
దొరకని మంచు దృశ్యాలను ఆర్తి చేతులతో, అప్పడే
అల్లా గుసగుస లాడతాడు తన ప్రార్థనా పెదాలతో, అప్పడే
దేహం సుగంధ పుష్పం అవుతుంది వేకువ ఝాము పరిమళంతో
చుట్టుకుంటాయి పువ్వులు విచ్చుకుంటున్న రేకలతో
పలుకరిస్తుంటాయి పిట్టలు సింథసైజర్ శబ్దాలతో
ఇక అప్పడు
దేహం పునర్జన్మిస్తుంది
చీకటి పొర తొలగిపోతున్న మాయ తెరల దృశ్యాలతో
వాకిళ్ళు ప్రాణం పోసుకుంటాయి
ఈప్స్ చేతిలోని చీపుర్ల చలనంతో
వీధులు గజ్జెలవుతాయి నీటి గాజుల చప్పళ్ళతో
ఇక అప్పడే
తూర్పు తన సూర్య సితార్‌ని వెలికితీస్తుంది
ప్రపంచంతో కలసి జుగల్ బందీ చేసేందుకు –!

— కె. శ్రీకాంత్



గిరిగీసుకుని వుండిపోవటానికి ఇది కూడా ఓ కారణమే. శిరీష నాకు అమ్మలా – దేవతా స్త్రీలా – కన్పించేది. అందుకే ఆమె మీద అంతులేని గౌరవం ఏర్పడింది. ఆమె నా మీద చూపించే శ్రద్ధంతా, తల్లి పసిపిల్లాడి మీద చూపించే వాత్సల్యంలా అన్పించేది. మేమిద్దరం ఒకే వయసు వాళ్ళమైనా – –ఆడపిల్లల్లో ఆ మాతృత్వపు హుందాతనం స్వతహాగా వస్తుందనుకుంటాను. శిరీష నాకంటే పెద్దదానిలా ప్రవర్తించేది. ఏం చేయాలో – ఏమి చేయ కూడదో చెప్పేది. సింహాసనం మీద కూచున్న రాణిలా అన్పించేది. ఆమె మాట వేదవాక్కు నాకు – ఆమె గీసిన గీతదాటే వాడిని కాదు. ఆమె నీడలా కదిలే వాడిని.

ఆరోజుల్లో కవిత్వం వ్రాస్తుండే వాడిని. నేను వ్రాసే ప్రతి పదమూ శిరీషకు అంకితం చేసేవాడిని. నేను చేసే ప్రతి పనీ ఆమె కోసమే – వూపిరి పీల్చేది కూడా ఆమె కోసమే.

డిగ్రీ తర్వాత శిరీష చదువు ఆపేసింది. నేను కూడా ఆపేస్తానంటే ససేమిరా వినలేదు. బలవంతం చేసి – అలిగి – అన్నం మానేసి – ఏడ్చి – ఒప్పించింది.

పీజి కోర్సు కోసం వాల్తేర్ వెళ్ళే రోజు తన మనసులోని మాటను స్పష్టంగా బైట పెట్టింది.

"మనం పెళ్ళి చేసుకుందాం" అని

శిరీషకు నేనంటే ఇష్టమని తెలుసు. కానీ పెళ్ళిదాకా ఆలోచించి ఓ స్థిరాభిప్రాయాన్ని కొచ్చిందని అప్పటి వరకూ నాకు తెలియదు.

నేను కూడా అంతే ఖచ్చితంగా చెప్పాను నాకిష్టం లేదని. దానికి బలీయమైన కారణాలున్నాయి. నాలాంటి పేదవాడినిచేసుకుని శిరీష ఏం సుఖపడ్తుందీ – తన తాహతుకు తగిన వ్యక్తిని చేసుకుంటే మహారాణిలా వుంటుంది. నాకెప్పుడూ శిరీష గొప్పగా – వున్నతంగా వుండాలనే వుండేది. నేను ఆరాధించి, పూజించిన స్త్రీని – భార్యగా – సంసార ఝంఝూటంలోకి ఈడ్చి – ప్రేమించి – కామించి– కోప్పడి – విసుక్కుని – నువు నా దానివి – నీమీద అధికారాలన్నీ నావీ... అనాలంటే....ఏమిటో ....ఇన్నాళ్ళు అనుభవించిన ఈ తియ్యటి స్నేహం – మా మధ్య వున్న వాత్సల్యం – సున్నితమైన అనుభూతులూ – వీటన్నిటికీ నీళ్ళు వదులుకుని.....

నా పేదరికం – మరొకరి దయా దాక్షిణ్యాల మీద ఆధారపడిన బ్రతుకు నాలో ఆత్మన్యూనతా భావాన్ని పెంపొందించిన మాట వాస్తవమే. అందుకే శిరీష ఎక్కడో నక్షత్రాల మధ్య మణి కిరీటంతో మెరిసే వెన్నెల రాణిలా అన్పించేది. నేనెక్కడో అథఃపాతాళంలో కూరుకుపోయిన మట్టి రేణువులా –

సినిమాల్లోనూ, కథల్లోనూ ఇలాంటి ప్రేమలూ – పెళ్ళిళ్ళూ బాగానే వుంటాయి. కానీ ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే....

"ఏవిటీ ప్రాక్టికల్‌గా ఆలోచించడం – మనం బ్రతకలేమా – మనల్ని మనం పోషించుకునే పాటి ఉద్యోగాలు సంపాదించలేమా" అనేది రోషంగా శిరీష.

"నీకు ధైర్యం లేదు. నీవు పిరికివాడివి" అని తిట్టింది.

"నేను కొంత డబ్బు తెస్తాను. ఎక్కడికైనా వెళ్ళిపోదాం – దూరంగా – ఎక్కడికో .... " అనేది కలల్లో తేలిపోతున్నట్లు కళ్ళు అరమోడ్పులు చేసి.

"కావాలంటే నీకు ఉద్యోగం వచ్చే వరకూ ఎదురు చూస్తాను. ఎంత చిన్న ఉద్యోగమైనా పర్లేదు. మన ప్రేమ చాలదూ – హాయిగా బ్రతకడానికి" అనేది.

అవన్నీ ఎమోషనల్ మాటలనిపించేవి, ఎందుకో నాకు శిరీషతో పెళ్ళయితే ఆమెలో నేను చూసిన దైవత్వం – గ్రీకు, ఈజిప్షియన్ మహారాణుల్లో వుండే ఆ ఠీవి – పువ్వులోని పరిమళం మల్లే ఆమెలోని సహజమైన ప్రేమ. స్పాంటేనియస్‌గా వ్యక్తమయ్యే వాత్సల్యం – కోల్పోతానని భయమేసేది.

నా ఆలోచన తప్పేమో – ప్రాక్టికల్‌గా ఆలోచిస్తున్నాననే ముసుగులో నా పిరికితనాన్ని, ఆత్మాన్యూనతా భావన్ని కప్పిపుచ్చుకుంటున్నానేమో.

ఏమైతేనేం – నేను పెళ్ళికి ఒప్పుకోలేదు. క్షీణిస్తున్న వాళ్ళనాన్నగారి ఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకుని ఆయన బలవంతం మీద శిరీష పెళ్ళికి ఒప్పకుంది – ఓ బిజినెస్ ఎక్జిక్యూటివ్‌తో.

"ఏవిటీ అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు"

ఉలిక్కిపడి తలయెత్తి చూశాను. ఎపుడు వచ్చిందో శిరీష – నా ఎదురుగా కుర్చీలో కూచుని – రెండు అరచేతుల మధ్య చెంపల్ని ఆనించి తదేకంగా నా వైపు చూస్తోంది.

"ఏమీ లేదు" అన్నాను తడబడుతూ.

"నీ ముఖం – ఏం లేకపోవడం ఏమిటి – నా గురించే ఆలోచిస్తుంటావు" అంది కాన్ఫిడెన్స్‌ని కంఠంలో పలికిస్తూ.

"ఏవిటంత నమ్మకం" అన్నాను ఉడికిస్తూ.

"నీ జీవితం నిండా పర్చుకున్న నేను తప్ప నీ ఆలోచనల్లోకి వచ్చేంత చొరవ మరెవరి కుంది?" అని నవ్వుతోంది.

నా గదిలో వెన్నెల పిండారబోసినట్లు – గదంతా ధగధ్ధగాయమైన కాంతితో మెరిసి పోతున్నట్లు.

"నాకు చెప్పవూ – ఆ ఆలోచనలేమిటో. ఆ జ్ఞాపకాల్ని నాతో పంచుకోవూ" దగ్గిర కొచ్చి చేతులు పట్టుకుని చిన్న పిల్లలా మారాం చేస్తోంది.

"ఎన్ని సార్లు చెప్పుకున్నా – అవే కదా " అన్నాను.

"అయినా నా కిష్టమే. చెప్పవూ – నాకు తనివే తీరదు. ఆరోజుల్లోనే కదూ నేను నిజంగా జీవించి వున్నది – ఇదీ ఓ జీవితమేనా జీవచ్ఛవంలా ....ఆక్షణాలే కదూ నన్నింకా బ్రతికిస్తుంది – చెప్పవూ....ప్లీజ్ చెప్పవూ...." చిన్న పిల్లలా మూతి సున్నాలా చుట్టి – చేతులు బలంగా వూపుతూ....

"ఆకలి వేయడం లేదా శిరీ– అపుడే పన్నెండు దాటింది. వంట ఎపుడు చేసేట్టు – ఎపుడు తినేట్టు ....కొద్ది సేపు రిలాక్సవ్వు. నేను వంట చేస్తాను." అని లేచాను.

కోపంగా చూసింది శిరీష – పురాణకాలం నాటి సత్యభామలా.

"ఓహో....ప్రాక్టికల్ మనిషివి కదూ. తీయటి జ్ఞాపకాలు కన్నా ఆకలే ముఖ్యం. ప్రేమ కన్నా – ప్రేమించిన స్త్రీ కన్నా ......" ఆగిపోయింది.

"వూ...చెప్పు...ఒంటరి తనం ముఖ్యం ...అంతేనా" అని నవ్వి వంటగదిలోకెళ్ళాను.

"నేనుండగా నీవు కష్ట పడటం ఏమిటి – లే –నేను వండుతాను– చెప్పు...నీకేం వెరయిటీలు కావాలో" అంటూ ఫ్రిజ్ తెరిచి "కూరగాయలేవీ" అని పడీ పడీ నవ్వుతోంది – సముద్రపు కెరటాల్లా.


"బ్రహ్మ చారివి కదూ – మరిచే పోయా"

శిరీష ఎంత హాయిగా నవ్వుతుందో... కబుర్లలోనే భోజనాలయి పోయాయి.

"ఇంకా బోల్డున్నాయి. చెప్పుకోవాల్సినవి" అని వచ్చి మంచం మీద కూచుంది. నేను ఎత్తుగా దిండ్లు వేసుకుని జారగిల బడ్డాను.

"ఓసారి నేను వాల్తేర్‌లో వున్నప్పుడు నీవు లెటర్ రాశావు. ఒకే ఒక వాక్యం – 'నిన్ను చూడాలని వుంది' అని. ఆ లెటర్ వచ్చినపుడు నేను ఫిజిక్స్ ల్యాబ్‌లో వున్నాను. ఆ వాక్యం చదివిన తక్షణం ల్యాబ్ వదిలేసి బైటికొచ్చేశాను. రూంకి కూడా వెళ్ళలేదు. చేతిలో చిల్లిగవ్వలేదు. కన్పించిన వాడినల్లా అప్పడిగాను. అపుడు రాడికల్స్ బంద్ చేస్తున్నారని రైళ్ళు నిలిపి వేశారు. ఒంగోలు ఎలా వచ్చానో తెలియదు. సగం దూరం లారీల మీదే ప్రయాణం చేశాను" అన్నాను.





# పండోరా పెట్టె

అల అకస్మాత్తుగా అంతెత్తున లేచినపుడు
అల్పజీవి ఎపుడైనా అలా పైకిపోయి
సముద్రాన్ని శాసించగల ననుకోవచ్చు:
నిమిషం నిలవక ముందే నీటిలో పడి నిట్టూర్చుతుంది.
ఏటికి ఎదురీదీ ఎదురీదీ ఓపిక చచ్చినవాడికి
వాలితే ఓ రోజు మేలనిపించవచ్చు:
తీరం చేరాక తల పట్టుకుంటాడు.
ఆయుధం మోసీ మోసీ అలసినవాడు
ఓటును ఈ మాటు వాటేసుకోవచ్చు:
శ్లేష్మంలో ఈగలా శేషజీవితం గడుపుతాడు.
లోకసభ చూడర బాబూ – అంటూ శేషన్డు
తన ప్రతాపం ప్రదర్శింప ప్రయత్నించవచ్చు:
గల్లాపెట్టె గాలి ధాటి కతను గజగజలాడుతుండగా
కర్నూల్ బ్రాండ్ కల్తీ సూర్యప్రకాశం మన కన్పిస్తుంది.
రావు బహద్దూర్ రిగ్గింగ్ రాజును రోజూ చూసి రోత పుట్టి
ఇడియట్ బాక్స్ యింకో ఛానెల్కు మీరు మారవచ్చు:
గాట్ గర్ధభ గానానికి మన్మోహనంగా ముడ్డి ఊపుతూ
ప్రక్క తాళం మంత్రి ప్రత్యక్షమవుతాడు.
బ్యాలెట్ బాక్స్లో భాను దుదయిస్తాడా?

"బదాయి – నడిచి రాలేదు కదా"

పెద్దగా నవ్వొచ్చింది నాకు. "అలాంటివి సినిమాల్లో, నవలల్లో వుంటాయేమో – నేను వాటిలోని హీరోల్లా ధీరోదాత్తుడిని కాదని ఒప్పుకున్నాకదా."

"అమ్మ వున్న రోజుల్లో మా ఇంట్లో అన్నంలో కారం కలుపుకుని తిన్నావు – గుర్తుందా. ఎర్రకారం – నేను చెప్పనే వున్నా. నీకు అలవాటు లేదని. అయినా తిన్నావు. మొండితనం – నీ కళ్ళలో గిర్రున నీళ్ళు తిరగటం నాకింకా గుర్తుంది" అన్నాను.

"నా కన్నీళ్ళు చూడలేక నీ కళ్ళలో కూడా నీళ్ళొచ్చాయి కదూ"

నా జుట్టుని నిమురుతూ అంది శిరీష. శిరీషకు భర్త కావటం కంటె కొడుకు కావటంలోనే గొప్ప అదృష్టం వుందనిపిస్తుంది చాలా సార్లు.

"మనిద్దరం వెన్నెల రాత్రుళ్ళు డాబా మీద కూచుని గడిపిన రోజులూ – నీవు నా ఒడిలో పడుగుని చెప్పిన కబుర్లు...." మధ్యలో ఆగిపోయింది శిరీష.

ఆమె వదనం దుఃఖంతో రంగు మారింది.

"ఎందుకు మన జీవితాలిలా అయిపోయాయి..." అంది గద్గద స్వరంతో.

"మన జీవితాలకేమైంది శిరీ – దరిద్రంలో బ్రతికిననాకు మంచి ఉద్యోగం వచ్చింది. నీకు తగిన భర్త దొరికాడు. మంచి సహృదయుడు కూడా. మన స్నేహానికి అడ్డు చెప్పకూడదన్న కండిషన్ని మనసారా ఒప్పుకునే పెళ్ళి చేసుకున్నాడు కదా. నీ పెళ్ళయాక ఎన్నిసార్లు మనం మీ ఇంట్లో ఫ్రీగా మాట్లాడుకోలేదూ –ఇపుడు నిన్ను ఒంటరిగా పంపారంటే – మనమీద ఎంత నమ్మకం వుంటే పంపించి వుంటారూ – మనం అదృష్టవంతులం కదూ"

"ఏవిటీ అదృష్టం...." సివంగిలా లేచింది శిరీష

"ప్రేమించిన వాడిని కాదని వేరో వాడితో ఇష్టంలేని కాపురం చేయడమా అదృష్టం – అతను సహృదయుడూ, మంచివాడూ అయితే చాలా – నేను ప్రేమించొద్దూ – నేను నిన్ను ప్రేమించాను. నీవు దుర్మార్గుడివైనా, దుష్టుడివైనా ఇలానే ప్రేమిస్తాను. నాకూ నేను ప్రేమించిన వ్యక్తి కావాలి – అతనిలో ఎన్ని అవలక్షణాలున్నా సరే. అతనితో పోల్చితే ఎంతటి ఆదర్శపురుషుడైనా నాకు తృణప్రాయమే. అసలు నీకు స్త్రీ మనసెపుడు అర్థమౌతుందీ – మాట్లాడితే చాలు స్నేహం అంటావు.... అప్పటిలా నీవునా ఒడిలో వెన్నెల రాత్రుళ్ళు పడుకుంటె నాభర్త ఒప్పుకుంటాడా – అప్పటిలా నేను అన్నం కలిపి ముద్దలు నీకు తినిపిస్తే సహించగలడా – నీకింత దూరంగా బ్రతకటం ఎంత దుర్భరమో ఆలోచించవేం"

నేను చాలా సౌమ్యంగా అడిగాను.

"ఒళ్ళో పడుకుంటేనేనా ఇష్టం – పడుకోక పోతేనేం"

శిరీష ఓ నిరసన చూపొకటి చూసి అంది. " ఇంకొంత సేపుంటె నన్నెందుకు ప్రేమించావు – ప్రేమించావు అసలు – ప్రేమించకపోతేనేం అంటావు"

మాటల్లోనే చీకటి పడిపోయింది. ఇద్దరికీ మనసు బరువుగానే వుంది.. తిండి మీద ధ్యాసే లేదు. తప్పదు కాబట్టి తిన్నాం.

శిరీష బెడ్ని నీట్గా దులిపి సర్దింది.

"నేను కింద పడుకుంటాను" అన్నాను.

కళ్ళలో మెరుపులు కురిపిస్తూ చూసింది శిరీష.

"ఏం – మనమెప్పుడూ పక్క పక్కనే పడుకోలేదా"

"అపుడు వేరు. నీకింకా పెళ్ళి కాలేదు – –ఇపుడు నీవు ఒకరి భార్యవి"

"పారబడ్డావు – నేనెపుడూ నీదాన్నే"

శిరీషతో వాదించినా ప్రయోజనం వుండదని తెల్సు – ఇద్దరం పక్కపక్కనే పడుకున్నాం

ఎవరి ఆలోచనల్లో వాళ్ళం మునిగిపోయాం.

శిరీష నిశ్శబ్దాన్ని ఎక్కువ సేపు భరించలేదు.

"నా పెళ్ళయిన ఈ రెండు సంవత్సరాల్లో మనకు దొరికిన మొదటి ఏకాంతం ఇదే కదూ" అంది నా వైపు తిరుగుతూ.

నేను సమాధానం చెప్పలేదు.

"మనసొకరికి, శరీరం మరొకరికి ఇవ్వటంలో జీవితం అసంపూర్తిగా అన్పిస్తుంది. నాకు సంపూర్ణమైన జీవితం

కావాలని వుంది" శిరీష తన చేతిని నామీద వేసింది.

"నీ పిరికి తనంతో, న్యూనతాభావంతో నా జీవితంలో ఎంతటి అశాంతిని, అలజడిని కలుగచేశావో నీకేమైనా అర్థమౌతుందా – ఈ గుండెల్లో మండే అగ్ని, అసంతృప్తి చల్లారాలంటే నన్ను నేను పూర్తిగా నీకు అర్పించు కోవాలి" అంది నన్ను దగ్గిరకు లాక్కుంటూ.

"అది నైతికంగా దిగజారటమే శిరీ – నీ భర్తమన మీద వుంచిన నమ్మకాన్ని వమ్ము చేసినట్లు కదూ–అతన్ని మోసం చేయటం కదూ" అన్నాను బాధగా.

"కాదు. మోసం ఎందుకవుతుంది. నా మనసూ, శరీరమూ మీద నీకు లేని అధికారం మరెవ్వరికీ లేదు. నేను నీదాన్ని – నీవు నా వాడివి. నీ మీది సర్వాధికారాలూ నావే – నీవు నాకు కావాలి – నీవు నాకు కావాలి" అల్లుకు పోతున్న శిరీషను బలంగా వెనక్కి నెట్టి లేచాను.

దెబ్బతిన్న పులిలా చూసింది శిరీష. ఆ కళ్ళలో తిరస్కారంలోని పదునంతా అనుభవించిన బాధ –

"నీ మీద నాకెవుడూ అటువంటి అభిప్రాయం లేదు. ఇవుడు రమ్మన్నా రాదు శిరీ – నీవంటె నాకెప్పటికీ పూజ్య భావమే" అని క్రింద చాప వేసుకుని పడుకున్నాను.

ఆ తర్వాత ఎవ్వరం మాట్లాడుకో లేదు. రాత్రంతా నిద్రకూడా పోలేదు. సన్నటి వెక్కిళ్ళ మధ్య శిరీష – అంతులేని ఆలోచనల్తో నేనూ గడిపాం.

వారం వరకూ వుంటానని చెప్పిన శిరీష ఉదయమే బయల్దేరింది. ఎంత బ్రతిమాలినా వినకుండా – ఒక్క మాటైనా మాట్లాడకుండా ఒంగోలు తిరిగి వెళ్ళిపోయింది. నాకు అంతులేని శూన్యం మిగిల్చి.

వెళ్ళేముందు ఒకే ఒక మాట మాట్లాడింది.

"నేను బజారు స్త్రీలా ప్రవర్తించాను కదూ" అని.

నా తిరస్కారం ఆమెలోని నైతిక విలువల్ని తట్టిలేపి వుండాలి. అందువలన గిల్టీ కాన్షస్‌నెస్....అదిపోగొడితే కానీ మరలా నాకు శిరీష స్నేహం దొరకదు.

అందుకే శెలవుపెట్టి ఒంగోలుకు బయల్దేరాను.

శిరీష బాగా చిక్కినట్లు కన్పిస్తోంది. కళ్ళకింద నల్లటి వలయాలు ఏర్పడ్డాయి. మనిషిలో ఒకప్పటి ఉత్సాహం లేశ మాత్రం కూడా లేనట్లు ప్రవర్తిస్తోంది. ఓ యంత్రంలా – మెకానికల్‌గా – ఆత్మను ఎక్కడో పారేసుకున్న దానిలా

చిన్న పలుకు కూడా లేదు శిరీష నించి – నేనడిగిన దానికి చాలా పొడిగా సమాధానాలిస్తోంది. వీలైనంతగా తప్పించుకుని తిరుగుతోంది.

మధ్యాహ్నం భోజనాల దగ్గర కూడా తలదించుకునే కూచుంది. బజారు స్త్రీలా ప్రవర్తించానన్న అపరాధ భావన ఆమెను కొద్ది కొద్దిగా తినేస్తుందను కుంటా. తన ప్రవర్తనలో తప్పులేదనో – లేక నేను చాలా నవ్యంగా అర్థం చేసుకున్నాననో – లేక నా హృదయంలో ఆమెకున్న గౌరవం తగ్గలేదనో చెప్పటం వల్ల ప్రయోజనం వుండదని పిస్తోంది. అలా చెప్పటం వల్ల ఆమెలోని గాయాన్ని ఇంకా కెలికినట్లవుతుంది. లేదా నా హృదయౌన్నత్యాన్నిచాటుకునిఆమెనింగా తక్కువదాన్ని చేసినట్లవుతుంది.

ఉయ్యాల బల్లమీద దిండేసి పడుకున్నాను. నాకెంతిష్టమో – దీంతో అల్లుకుని ఎన్నెన్ని తీయటి జ్ఞాపకాలో

రెండు గంటల్నించీ శిరీష బైటికే రాలేదు. తన గదిలోనే వుండిపోయింది. పని మనుషులు కూడా వెళ్ళిపోయారు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

తలుపు దగ్గర నిలబడి గదిలోకి తొంగి చూశాను. మంచం మీద అటు వైపు తిరిగి పడుకుని వుంది. నాకు తెలుసు – తను నిద్రపోవటం లేదని.

బిడియంగా లోపలికెళ్ళాను. నా అడుగుల సవ్వడి విన్నట్లు శిరీష కొద్దిగా కదిలింది. మంచం అంచుమీద కూచున్నాను – భయంగా....అదురుతున్న గుండెల్ని చిక్కబట్టుకున్నాను. తడారిపోయిన గొంతుని సరియైన మాడ్యులేషన్ లోకి రప్పించే వృథా ప్రయాస చేస్తూ మాట్లాడటం ప్రారంభించాను.

"శిరీ – నీ ప్రేమని మొదట్నించీ నేను సరిగ్గా అర్థం చేసుకోలేక పోయాను. నీకు అంతులేని మానసిక క్షోభను కలుగ చేశాను. నా అవివేకం వల్లనే నిన్ను మరొకరికి ధారాదత్తం చేశాను. ఇప్పటికి నా కళ్ళు తెర్చుకున్నాయి"

కొద్దిగా ఆగాను. గొంతులో ఆదోరకమైన జీర.

"నాలోని పిరికి తనాన్ని జయించటానికి ఇంత కాలం పట్టింది. నిన్ను – నాదాన్ని – నా ప్రాణాన్ని బాధ పెడ్తూ నేను బ్రతకలేను. మనసుల్తోపాటు శరీరాలు కూడా కలిస్తేనే ఆ ప్రేమకు సార్థకత – నా జీవితానికి సాఫల్యం అందులోనే వుంది"

శిరీషను పొదిలి పట్టుకుని నా వైపుకు తిప్పాను. ఆమె కళ్ళలో నీళ్ళు...

నా చేతులు వణక్కటం నాకు స్పష్టంగా తెలుస్తోంది.

"నీ భర్త క్యాంప్‌లో వుంటాడని తెలిసే వచ్చాను. మరో మూడ్రోజుల వరకూ రాడని చెప్పావుగా. ఈ మూడు రాత్రుళ్ళూ నీ కౌగిట్లోనే గడువుతాను. రా శిరీ – మన జీవితంలోని మొదటి మూడు రాత్రుల్ని మధురమైన అనుభూతుల్తో నింపేద్దాం. ఈ తీయటి క్షణాల్ని స్వర్గసుఖాల్తో ముంచెత్తుదాం" శిరీషని బలంగా కౌగిలించు కున్నాను.

గువ్వలా ఒదిగిపోయింది కౌగిట్లో – నాలో తడబాటు – పొరపాటు చేస్తున్నానా – ఓడిపోతున్నానా.

అంతులేని నిస్పృహ నాలో –.

రెండు క్షణాల తర్వాత చలనం వచ్చింది శిరీషలో. చేతుల్ని నా గుండెల మీద వేసి బలంగా వెనక్కి నెట్టింది. కొద్దిగా తూలాను ఆ విసురుకి.

"నాకు పెళ్ళయిందన్న జ్ఞానం వుందా నీకు" అంటూనే తన కుడిచేతిని బలంగా విసిరింది. నా చెంప ఛెళ్ళుమంది. కళ్ళముందు ఓ క్షణం మెరుపులు మెరిశాయి.

అవుడు చూశాను శిరీషలో – అంతులేని ఆనందాన్ని. ఆమె కళ్ళు గర్వంతో మెరుస్తున్నాయి. తన క్యారెక్టర్‌లోని ఔనత్యాన్ని రుజువు చేసుకున్న ఆనందం ఆ కళ్ళలో – దిగ జారబోతున్న వ్యక్తిని నైతిక బాధ్యతలు గుర్తు చేసి సన్మార్గంలో పెట్టగలిగానన్న సంతృప్తి ముఖం నిండా –

ఇవుడు శిరీషలో ఎప్పటి మల్లే వింత వెలుగు చోటు చేసుకుంది – దేవతల తలల చుట్టూ వుండే కాంతి వలయంలా – ఈజిప్షియన్, గ్రీకు మహారాణుల్లోని గ్రేస్ వచ్చేసింది.

అశ్రుపూరితాలయిన నా కళ్ళని తను చూడకుండా తల దించుకున్నాను. నా కళ్ళలో కూడా అద్భుతమైన వెలుగు – గెలుపులోంచి ఉత్పన్నమైన ఆనందం – మా స్నేహాన్ని మరలా బ్రతికించుకున్నానన్న సంతృప్తి. ■

## నాను!

**ము**ళ్ళపూడి వెంకటరమణగారి 'జోక్స్' పాతబడేవీ, కరిగేవీ, అరిగేవీ కాదు. ఎప్పడైనా విచ్చు రూపాయిలా చెల్లుబడి అయ్యేవవి.'అందాలరాముడు'లో నాగభూషణం, పొట్టిప్రసాద్‌ల యీ సంభాషణ చూడండి. నవ్వులో 'నావ' కుంటే అడగండి.

గొప్పింటి జె.బి. (నాగభూషణం): రేయ్ బట్లర్!

బట్లర్ (పొట్టిప్రసాద్): సర్!

జె.బి.: ఆమ్లెట్ క్యాన్సిల్, నాలుగు పెసరట్లు వెయ్!

బ: బట్ సర్...

జె.బి.: ఏవిటది?

బ: పిండి రుబ్బాలి

జె.బి.: రుబ్బు

బ: పెసలు నానాలి

జె.బి.: నాను

– 'బాపూరమణీయం'